# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాజకీయాల అంతిమ లక్ష్యం ప్రజాసేవ అని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు సానుకూల వాతావరణం ఉందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు.
- ❖ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా అర్హత కలిగిన రైతులకు బిందు సేద్యం పరికరాలను రాయితీపై అందిస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.
- ❖ విశాఖపట్నం నుంచి విజయవాడకు మరో రెండు విమాన సర్వీసులు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి.
- ❖ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం రేపు 11 గంటలకు ప్రసారం కానుంది.

==============================

రాజకీయాల్లో ఎన్ని మార్పులు, సంస్కరణలు వచ్చినా అంతిమ లక్ష్యం మాత్రం ప్రజాసేవే అని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పేర్కొన్నారు. ఈ రోజు ఆయన గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ ఎంతో మంది నాయకులను తయారు చేసిందన్నారు. రాజకీయ కార్యకర్తల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వారి సంక్షేమం కోసం 5 లక్షల రూపాయల వరకూ ప్రమాద బీమా అందిస్తున్నామని అన్నారు.

==============================

రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటిస్తున్నారు. ఈరోజు శాన్ ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు గల అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు వివరించానని సామాజిక మద్యమం వేదికగా ఆయన తెలియజేశారు. పరిపాలనలో కృత్రిమ మేధస్సు  వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసువస్తామని తెలిపారు. నైపుణ్యతతో కూడిన మానవవనరులను అందించడానికి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విద్యారంగంలో కూడా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు.

==============================

ప్రకాశం జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు సన్నకారు, చిన్నకారు రైతులకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా 90 శాతం సబ్సిడీతో బిందు సేద్యం పరికరాలను అందిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి పరిషత్ కార్యాలయం వద్ద ఈరోజు ఎపిఎంఐపి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకం కింద రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను మంత్రి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 75 వేల ఎకరాలకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా బిందు సేద్యం పరికరాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 2 వేల 931 మంది రైతులకు 33 కోట్ల 11 లక్షల రూపాయల రాయితీతో బిందు సేద్యం పరికరాలను అందించడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు తక్కువగా వున్నాయని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించేలా డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా అర్హత కలిగిన రైతులకు  బిందు సేద్యం పరికరాలు అందిస్తామని తెలియజేశారు.

==============================

విశాఖపట్నం నుంచి విజయవాడకు మరో రెండు విమాన సర్వీసులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రేపు ప్రారంభించనున్నారు. ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు ఈ సర్వీసులను నడపనున్నాయి. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం సాయంత్రం 7 గంటల 15 నిమిషాలకు బయలుదేరి, రాత్రి 8 గంటల 20 నిమిషాలకు విశాఖ చేరుకుంటుంది. తిరుగు పయనంలో 8 గంటల 45 నిమిషాలకు బయలుదేరి రాత్రి 9 గంటల 50 నిమిషాలకు విజయవాడ వస్తుందని అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ఉదయం 9 గంటల 35 నిమిషాలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి 10 గంటల 35 నిమిషాలకు విజయవాడ చేరుకుంటుందని, తిరుగు పయనంలో 7 గంటల 55 నిమిషాలకు బయలుదేరి 9 గంటలకు విశాఖపట్నం వస్తుందని తెలియజేశారు.

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

విరామం

==============================

రాష్ట్రంలో సగటు వృద్ధి రేటు 15 శాతం నమోదయ్యేలా పారిశ్రామిక వేత్తలు తమ వంతు సహకారం అందించాలని 20 సూత్రాల పథకం అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. నూతన పరిశ్రమల అవసరాలు, పెట్టుబడి సహకార విధానాలు అనే  అంశంపై వైజాగ్ డవలప్మెంట్ కౌన్సిల్, ఏపి ఛాంబర్స్ ఆధ్వర్యంలో ఈరోజు విశాఖపట్నంలో

నిర్వహించిన సదస్సుకు స్థానిక  పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరింత సమాచారాన్ని మా ఆకాశవాణి విశాఖపట్నం ప్రతినిధి వి. సత్యనారాయణ మూర్తి అందిస్తారు.

(వాయిస్ 29 సెకన్లు)

===============================

పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు ఏనుగుల సమూహాలు సంచరిస్తున్నాయని జిల్లా అటవీ శాఖాధికారిని జీఏపి ప్రసూన ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మండలం దిబ్బగుడివలస గ్రామ పరిధిలో 7 ఏనుగులతో కూడిన ఒక సమూహం, భామిని మండలం జామిగూడ గ్రామ సమీపంలో 4 ఏనుగులతో కూడిన మరో సమూహం సంచరిస్తున్నాయన్నారు. ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఇచ్చిన సూచనలను ప్రజలు ఖచ్చితంగా పాటించాలని ఆమె కోరారు. అడవి ఏనుగులు రోజులో ఎక్కడైనా సంచరించే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాలలో గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామ పెద్దలు, సర్పంచ్, సచివాలయ ఉద్యోగులు, పోలీసు శాఖ ఇతర శాఖలు గ్రామస్థులకు అవగాహన కల్పించడంలో అటవీ శాఖకు సహాయం చేయాలని కోరారు. అటవీ శాఖ పర్యవేక్షణను ఎవరైనా అడ్డుకున్నా, ఏనుగుల దగ్గరికి వెళ్లేందుకు ప్రయత్నించినా చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని తెలియజేశారు.

===============================

అనంతపురం జిల్లాలో ఈరోజు మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించారు. జిల్లాలోని శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద రహదారిపై ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా టైరు పగలడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీనీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

===============================

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఈ రోజు ఆయన రాజామహేంద్రవరంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 70 నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయని, ఎన్డీయే అభ్యర్థులను గెలిపించేందుకు కూటమి శ్రేణులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందించే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఎన్నికలకు సంబంధించి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేయాలని, నవంబర్ 6వ తేదీలోగా ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

===============================

భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ సహాయంతో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు ట్రైబల్ మ్యూజియంలో ఈరోజు “స్వచ్ఛ భారత్” కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పర్యాటక శాఖ సహాయ సంచాలకులు రావిపాటి కృపాకర్ పాల్గొన్నారు. పర్యాటక శాఖ అధికారులు కె. ప్రవీణ్ కుమార్, జి. దాసు, రత్నరమా, అరకు నైపుణ్యాభివృద్ధి పాఠశాల విద్యార్థులు, ఎపిటిడిసి సిబ్బంది, పాడేరు ఐటీడీఏ సిబ్బంది ఈ “స్వచ్ఛ భారత్” కార్యక్రమంలో పాల్గొన్నారు.

===============================

ఆంధ్రప్రదేశ్‌లో తీరప్రాంత భద్రత, పరస్పర సహకారంపై ప్రతీ సంవత్సరం జరిగే కోస్టల్ డిఫెన్స్ ఎక్సర్‌సైజ్ ను "సీ విజిల్ 2024" పేరిట నవంబర్ 20, 21వ తేదీల్లో నిర్వహించనున్నామని నేవీ అధికారులు తెలియజేశారు. ఈ మేరకు కార్యాచరణ ఏర్పాట్లపై ఆంధ్రప్రదేశ్ నావెల్ ఆఫీసర్స్ ఇన్‌ఛార్జ్ సిఎండి రజనీష్ శర్మ, కోస్టల్ సెక్యూరిటీ డీఐజీ గోపీనాథ్ జట్టి ఈరోజు విశాఖపట్నంలో సమీక్ష నిర్వహించారు.

================================

దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వి.త్రినధారావు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణంలో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

================================

================================